డిమాండ్ కొండంత .. కేటాయింపు గోరంత

- వేరుశనగ కేటాయింపులో కోత
- మడకశిర నియోజకవర్గంలో అవసరమైంది 21,500 క్వింటాళ్లు
- 11,549 క్వింటాళ్లు మాత్రమే కేటాయింపు
- కూటమి ప్రభుత్వ తీరుపై అన్నదాతల అసంతృప్తి

మడకశిర: నియోజకవర్గంలోని రైతులకు ఖరీఫ్‌లో ప్రధాన వాణిజ్య పంట వేరుశనగ. దీంతో వేరుశనగ విత్తనానికి అధిక డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో వేరుశనగ పంట సాగుకు రైతులకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా నిలబడాల్సి ఉంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం వేరుశనగ విత్తన కాయలను మడకశిర నియోజకవర్గానికి నామమాత్రంగా కేటాయించడంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. డిమాండ్ మేరకు విత్తన కాయలను కేటాయించకపోవడంతో రైతులు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. నామమాత్రంగా విత్తన కాయలను కేటాయించడమేంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అరకొర కేటాయింపులే..

నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేయడానికి 21,500 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలు అవసరమని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అయితే ప్రభుత్వం కేవలం 11,549 క్వింటాళ్ల విత్తన కాయలను మాత్రమే కేటాయించింది. దీంతో రైతులకు పూర్తి స్థాయిలో విత్తన కాయలు అందడం అనుమానమేనని భావిస్తున్నారు.


వేరుశనగ విత్తన కాయలను నిల్వ చేసిన దృశ్యం(ఫైల్)

వేరుశనగ సాగు తగ్గే అవకాశం

రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ మేరకు విత్తన కాయలను పంపిణీ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం రైతులకు విత్తన కొరత అధికంగా ఉంది. రైతులు కూడా విత్తన కాయలను ఇళ్లలో నిల్వ ఉంచుకోలేదు. ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనంపైనే ఆధారపడ్డారు. ఈ నేపథ్యంలో రైతులకు అవసరమైన విత్తన కాయలను పంపిణీ చేస్తేనే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. లేకపోతే వేరుశనగ పంట సాగు పూర్తిగా తగ్గే ప్రమాదం ఉందని అంటున్నారు. ప్రభుత్వం గరిష్టంగా 3 బస్తాల విత్తన కాయలు కాకుండా 5 బస్తాల విత్తన కాయలు అందించాలని రైతులు కోరుతున్నారు. డిమాండ్ మేరకు ప్రభుత్వం విత్తన కాయలను కేటాయించకపోతే ప్రభుత్వం రైతుల ఆగ్రహానికి గురికావడం ఖాయం.

మడకశిరలో వేరుశనగ విత్తన కాయల కేటాయింపు ఇలా....

మండలం	అవసరం	కేటాయింపు (క్వింటాళ్లలో)
మడకశిర	5,500	3,361
గుడిబండ	5,000	2,206
అమరాపురం	5,000	2,584
రొళ్ళ	3,500	1,845
అగళి	2,500	1,553

సబ్సిడీ విత్తనంపైనే ఆధారపడ్డాం



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవసరమైనంతమేరకు వేరుశనగ విత్తనాన్ని అందించాలి. లేకపోతే రైతులు విత్తనం కోసం ఇబ్బందులు పడాల్సి వస్తుంది. విత్తన కొరత అధికంగా ఉంది. సబ్సిడీ విత్తనంపైనే ఆధారపడ్డాం. ప్రభుత్వం ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా అవసరమైన విత్తనం అందించి ఆదుకోవాలి.

– జనార్ధన్‌రెడ్డి, జీ గొల్లహట్టి, రొళ్ల మండలం

ఐదు బస్తాలు అందించాలి



సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను గరిష్టంగా 5 బస్తాలు అందించాలి. నామమాత్రంగా విత్తనం అందిస్తే వేరుశనగ పంట సాగు చేయడం కష్టంగా మారుతుంది. డిమాండ్ మేరకు విత్తనం అందిస్తేనే పూర్తి స్థాయిలో పంట సాగుకు అవకాశం ఉంటుంది. లేకపోతే విత్తన కొరతతో రైతులు తమ భూములను బీడు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

– తిప్పేస్వామి, పీఎస్ పాళ్యం, గుడిబండ మండలం

రైతులకు అన్యాయం చేస్తారా?



నియోజకవర్గానికి నామమాత్రంగా వేరుశనగ విత్తనం కేటాయించడం అన్యాయం. సగానికి సగం విత్తన కేటాయింపు తగ్గించడం రైతులకు అన్యాయం చేయడమే. ఈ ఏడాది దాదాపు 22 వేల క్వింటాళ్ల విత్తనం అవసరం ఉంది. అయితే ప్రభుత్వం విత్తన కేటాయింపును 50 శాతం తగ్గించడంతో రైతులు విత్తన కొరతతో ఇబ్బందులు పడాల్సిందే. వెంటనే ప్రభుత్వం పూర్తిస్థాయిలో విత్తన పంపిణీకి చర్యలు తీసుకోవాలి.

– వన్నేష్, పీ బ్యాడిగెర, అగళి మండలం

క్లుప్తంగా

నేడు ఉచిత సామూహిక వివాహాలు


కాబోయే నూతన వధూవరులకు దుస్తులు అందిస్తున్న దృశ్యం

రొద్దం: మండల పరిధిలోని ఎల్‌జీబీనగర్ సమీపాన నూతనంగా నిర్మించిన సాయిగీతా ఏసీ కన్వెన్షన్ హాల్‌లో మండపంలో శనివారం ఉచిత సామూహిక వివాహాలు నిర్వహించనున్నారు. పెనుకొండ వైఎస్సార్‌సీపీ ఎంపీపీ గీత ఆధ్వర్యంలో ఎనిమిది జంటలకు ఉచితంగా వివాహాలు చేయనున్నట్లు రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. వివాహాలకు పేర్లు నమోదు చేసుకున్న జంటలకు నూతన వస్త్రాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. వివాహాలకు వచ్చే నూతన వధూవరుల బంధువులకు భోజన సౌకర్యం కల్పించామన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఇనాయతుల్లా

హిందూపురం: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఇనాయతుల్లా అన్నారు. పట్టణంలోని త్యాగరాజనగర్‌లోని మార్గదర్శి విద్యానికేతన్ పాఠశాలలో ఉచిత వేసవిబడిని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ కిఫాయతుల్లా, పాఠశాల నిర్వాహకులు మాళప్ప, సాయికళ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అక్కమ్మగార్ల ఉత్సవానికి ఆహ్వానం


వేణురెడ్డికి ఆహ్వానపత్రిక అందిస్తున్న దృశ్యం

చిలమత్తూరు: మండల పరిధిలోని పెక్కాలచెరువు వద్ద వెలసిన సప్తమాతృక ఏడుగురు అక్కమ్మగార్ల ఉత్సవానికి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక దంపతులను చిలమత్తూరుకు చెందిన వాల్మీకులు ఆహ్వానించారు. శుక్రవారం హిందూపురం పట్టణంలోని పార్టీ కార్యాలయానికి వెళ్లి ఈ నెల 2న జరిగే అమ్మవార్ల ఉత్సవానికి రావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎస్.రామకృష్ణారెడ్డి, నరేష్, వాల్మీకి సోము, ముద్దన్న తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం

హిందూపురం: పట్టణంలోని సుగూరు అభయాంజనేయస్వామి ఆలయం వద్ద సుమారు 45 అడుగుల ఏకశిలా విగ్రహం నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే వాల్మీకి సంఘం గౌరవాధ్యక్షుడు ఆదినారాయణ రూ.2 లక్షలు విరాళం అందించారని ట్రస్ట్ ఛైర్మన్ చంద్రశేఖర్, వైస్ ఛైర్మన్ రాయల్ గోపాల్ తెలిపారు.

రొళ్ల: మండల పరిధిలోని మల్లసముద్రంకు చెందిన రాధిక,గౌడప్ప కుటుంబ సభ్యులు శుక్రవారం జీరిగేపల్లిలో వెలసిన అమ్మాజి ఆలయం ధర్మకర్త మారన్న, కమిటీ సభ్యులకు రూ.లక్షను విరాళం అందించారు. కార్యక్రమంలో ముదుపన్న, బొమ్మేగౌడు పాల్గొన్నారు.

కేబుల్ చోరీ

రొళ్ల: మండల పరిధిలోని హెచ్‌టీ హళ్లిలో రైతులు ముద్దరంగప్ప గారి తిమ్మప్ప (వార్డు మెంబర్), శ్రీనివాస్ చెందిన వ్యవసాయ బోరుబావికి అమర్చిన విద్యుత్ కేబుల్ వైరును గురువారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. స్టార్టర్ నుంచి బోరుబావి వద్దకు అమర్చిన 80 మీటర్ల కేబుల్‌ను కత్తిరించుకెళ్లారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు రూ.12 వేలు నష్టం జరిగిందని వాపోయారు. గతంలోనూ చోరీ చేశారని, ఇప్పుడు మళ్లీ వైరు అపహరించారన్నారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

'108'కు అనారోగ్యం


గుడిబండ పీహెచ్‌సీలో 15 రోజులుగా మూలన పడిన 108 వాహనం

గుడిబండ: స్థానిక పీహెచ్‌సీకి కేటాయించిన 108 వాహనం 15 రోజులుగా మరమ్మతుకు నోచుకోక మూలనపడింది. కూటమి ప్రభుత్వం వల్ల ప్రజలకు మేలు జరిగిందేమీలేదని, కనీసం అత్యవసరాల కోసం 108 వాహనాన్ని వెంటనే ఉపయోగంలోకి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఎవరి ప్రాణాలు పోకముందే అధికారులు స్పందించాలంటున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


మడకశిరలో యోగా చేస్తున్న విద్యార్థులు

మడకశిరరూరల్: యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండొచ్చని యోగా గురువు శ్రీనివాసులు, మడకశిర మున్సిపల్ కమిషనర్ రంగస్వామి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో యోగాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పరిగి: నిత్యం యోగాసనాలు వేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని వక్తలు తెలిపారు. మండలంలోని సేవామందిరంలో శుక్రవారం అధికారుల ఆధ్వర్యంలో యోగా డేను పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు.

నిధులు ఎందుకు విడుదల చేయడం లేదు?

- ఎంపీడీఓను నిలదీసిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్


ఎంపీడీఓతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

గోరంట్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మండల పరిషత్ నిధులను అభివృద్ధి పనులకు వినియోగించకపోవడం, పాలక మండలి సభ్యులకు గౌరవ వేతనం చెల్లించకపోవడంపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ గోరంట్ల ఎంపీడీఓ నరేంద్రను నిలదీశారు. శుక్రవారం ఆమె మండల ప్రాదేశిక సభ్యులతో కలసి ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి ప్రజాస్వామ్య బద్ధంగా మండల పరిషత్ నిధులు విడుదల చేసి పాలక వర్గం ఆమోదం మేరకు అభివృద్ధి పనులు చేయాలని ఎంపీడీఓను కోరారు. రూ.80 లక్షల నిధులు ఉన్నా ఖర్చు చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే వెంటనే ఎంపీటీసీలకు అందించాల్సిన వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తీరు మార్చుకోకపోతే న్యాయ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటేష్, టౌన్ కన్వీనర్ మేదర శంకర, గోరంట్ల ఉప సర్పంచ్ రాజారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

శుభకార్యం

పరిగి: మండలంలోని గొరవనహళ్లికి చెందిన ఐటీ వింగ్ సభ్యుడు కురుబ శివ తమ్ముడు హరీష్ – శ్రీలక్ష్మీ వివాహం గత గురువారం జరిగింది. ఈ క్రమంలో శుక్రవారం శివ స్వగ్రామం గొరవనహళ్లికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ వెళ్లారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

'సోలార్' ప్రాజెక్టుకు భూముల పరిశీలన

అగళి: మండలంలో సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి తహసీల్దార్ సుబ్బరావు, ఆర్ఐ చంద్రశేఖర్ రావు, రెవెన్యూ అధికారులు భూముల పరిశీలించారు. పి బ్యాడగేర పంచాయతీలో 60 ఎకరాలు, హెచ్‌డీ హళ్లీలో 2,440 ఎకరాలు, రావుడిలో 1500 ఎకరాలు, ఇనగలూరులో 1000 ఎకరాలు భూములను గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

స్థలాల ఎంపికకు లాటరీ

పావగడ: స్థానిక మున్సిపల్ బస్టాండులోని పూల మండీల కోసం నూతనంగా ఎంపిక చేసిన స్థలంలో కొట్ల నిర్వహణకు లాటరీ ద్వారా స్థలాలను ఎంపిక చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం మీటింగ్ హాల్‌లో మున్సిపల్ ఛైర్మన్ సుదేశ్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో 20 మందికి వ్యాపార స్థలాలు కేటాయించారు. సుదేశ్ బాబు మాట్లాడుతూ ఇప్పుడున్న స్థలం నుంచి బస్టాండు వెనుక భాగంలో ఉన్న పార్కింగ్ స్థలంలోకి తరలి వెళ్లాలని పూల మండీల వ్యాపారులకు సూచించారు.

వీఎస్ఎస్ఎన్ సంఘం అధ్యక్షుడిగా రామలింగప్ప

పావగడ: తాలూకాలోని గుండార్లహళ్లి గ్రామ వీఎస్ఎస్ఎన్ సంఘం అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీ మద్దతుదారుడు రామలింగప్ప ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా సిద్దేశప్ప ఎన్నికయ్యారు. రామలింగప్ప జేడీఎస్ అభ్యర్థి బలరాంరెడ్డిపై మూడు ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. నూతన అధ్యక్ష,ఉపాధ్యక్షులను గ్రామ ప్రముఖులు సన్మానించారు.

మూతపడిన పాఠశాలలు పునఃప్రారంభించాలి

హిందూపురం టౌన్: పట్టణంలో మూతపడిన మున్సిపల్ పాఠశాలలను పునః ప్రారంభించాలని ఏపీఎంటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఏపీఎంటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్దగిరి శ్రీనివాసులు మాట్లాడుతూ పట్టణంలో ఈసీ గర్ల్స్, బాబు రాజేంద్రప్రసాద్ మున్సిపల్ పాఠశాలలు మూతబడ్డాయని, వాటిని వెంటనే పునః ప్రారంభించాలని కోరారు.

కర్ణాటక మద్యం అమ్మితే కఠిన చర్యలు

హిందూపురం టౌన్/పరిగి: కర్ణాటక మద్యాన్ని రవాణా చేసిన, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య హెచ్చరించారు. శుక్రవారం హిందూపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కర్ణాటక మద్యం అక్రమ రవాణా చేసిన కేసుల్లో 16 మంది పాత ముద్దాయిలకు ఒక సంవత్సర కాలానికి ఒక్కొక్కరికీ రూ.లక్ష పూచికత్తుపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. అలాగే పరిగి సేవామందిరం సమీపంలో నాగప్ప, హనుమంతరావు, పల్లవి నుంచి 108 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు.

కూటమి పాలనపై ప్రజల్లో వ్యతిరేకత

- అధికార పార్టీ నాయకులు ప్రజల్లోకి వెళ్లలేని పరిస్థితి
- గొప్పలు తప్ప హామీల అమలు ఏదీ?
- కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఆగ్రహం


వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

అమరాపురం: 'కూటమి పాలనపై ప్రజల్లో వ్యతిరేకత ఉంది. గొప్పలు చెప్పడం తప్ప హామీలను ఈ ప్రభుత్వం ఎక్కడ అమలు చేసింది. ఆ పార్టీ నాయకులు కూడా ప్రజల మధ్యకు వెళ్లలేక ఇళ్లకే పరిమితం అవుతున్నారు' అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలందరూ సమష్టిగా బాధ్యతతో గ్రామ స్థాయిలో పని చేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం అమరాపురం పట్టణంలోని చెరువు ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ అధ్యక్షతన మండల స్థాయి వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన నాయకులు, కార్యకర్తలతో ప్రజా సమస్యలు, పార్టీ బలోపేతం, మండల, గ్రామ స్థాయి కమిటీలపై చర్చించారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ఎవరికి ఏ కష్టం వచ్చిన అండగా ఉంటామన్నారు. గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై దృష్టి పెట్టి వాటి పరిష్కారానికి పోరాటం చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు మంచి గుర్తింపు ఇస్తామన్నారు.

ప్రజలకు చేసింది శూన్యం

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ఆర్భాటాలు తప్ప ప్రజలకు చేసింది శూన్యమని, దీంతో ప్రజల్లో వ్యతిరేకత అంతంతకూ పెరుగుతోందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. ఏ గ్రామంలోకి వెళ్లినా ప్రజలంతా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుభిక్ష పాలనపై చర్చించుకుంటున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా ప్రజలకు కష్టాలు తెచ్చి పెట్టారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలన అందించారని చంద్రబాబును నమ్మి మోసపోయామంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారని వెల్లడించారు. కూటమి ప్రజాప్రతినిధులు ప్రజల్లోకి వెళ్లలేక ఇళ్లకే పరిమితమవుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, వైస్ ఎంపీపీలు కృష్ణమూర్తి, రంజిత్‌కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు హాలుకూరు కాంతరాజు, నియోకవర్గ ఎస్సీ, బీసీ సెల్, బూత్ కమిటీ విభాగం అధ్యక్షులు శివన్న, శివకుమార్, మల్లికార్జున, వక్కలిగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు వీరక్యాతరాయప్ప, గగన, ఎంపీటీసీలు నారాయణ, హనుమంతరాయ, శాంతమణి, కెంచప్ప, అన సూయమ్మ, మైలారప్ప తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యం

అమరాపురం: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో శుక్రవారం ఉపాధ్యాయుడు నరసింహమూర్తి నూతనంగా నిర్మించిన గృహ ప్రవేశం ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప నాయకులతో కలిసి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పురంలో ట్రాఫిక్ అస్తవ్యస్తం

హిందూపురం టౌన్: పట్టణంలోని మెయిన్ బజార్, వీడీ రోడ్డులో సాయంత్రం వేళల్లో వాహనాల్లో వెళ్లాలంటే వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఈ రోడ్లలో ఇష్టానుసారంగా వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో సమస్య తలెత్తుతోంది. వీడీ రోడ్డులో ఎక్కువ సంఖ్యలో చాట్స్ షాపులు, హోటళ్లు, మాల్స్ ఉండటంతో పార్కింగ్ వస్తోంది. ఎక్కువ మంది వాహనదారులు వాహనాలను రోడ్లపైనే వదిలి వెళ్తుండడంతో ఈ మార్గం రాకపోకలు సాగించాలంటనే జనం బెంబేలెత్తిపోతున్నారు. ట్రాఫిక్ జామ్ ఏర్పడితే 20 నిమిషాల వరకూ క్లియర్ అవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని కోరుతున్నారు.


మెయిన్ బజార్‌లో ట్రాఫిక్ జామ్ కావడంతో నిలిచినపోయిన వాహనాలు

ఎంజేపీలో అడ్మిషన్లు ప్రారంభం

గుడిబండ: స్థానిక ఎంజేపీ బాలికల పాఠశాలల్లో 2025–26 విద్య సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు. ఎంట్రన్స్ పరీక్షలు వచ్చిన మార్కుల ఆధారంగా 55 మందికి అడ్మిషన్లు ఇచ్చామన్నారు.

రాధమ్మను సాగనంపండి

పావగడ: స్థానిక సబ్ రిజిస్ట్రార్ రాధమ్మ నిబంధనలు ఉల్లంఘించి ఇళ్ల స్థలాలు, భూముల ఖాతా బదిలీలు, నమోదుకు లంచం వసూలు చేస్తూ రైతులు, సాధారణ ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తోంది. ఆమె పై విచారణ జరిపి వెంటనే ఇక్కడి నుంచి బదిలీ చేయాలని స్థానిక కర్ణాటక రాజ్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ తనిఖీకి వచ్చిన జిల్లా సబ్ రిజిస్ట్రార్ శ్రీకాంత్‌కు వినతి పత్రం అందించారు.

రేషన్ దుకాణాల వద్దనే సరుకులు

అగళి: ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జూన్ 1వ తేదీ నుంచి రేషన్ షాపుల వద్దనే సరుకులు అందించనున్నట్లు తహసీల్దార్ సుబ్బరావు తెలిపారు. అయితే 65 ఏళ్లు పైబడి వృద్ధులు, దివ్యాంగులను గుర్తించి వారికి సరుకులు ఇంటి వద్దకే అందించాలని ఆదేశించామన్నారు.

విత్తనకాయ కోసం నమోదు చేసుకోండి

అమరాపురం: మండలంలోని రైతులు రైతు సేవా కేంద్రాల్లో సబ్సిడీ వేరుశనగ విత్తనకాయల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఓ మంజునాథ తెలిపారు. ఒక బస్తా ధర రూ.1674 ఉందని, మూడు బస్తాల ధర రూ 5,022 చెల్లించి నమోదు చేయించుకోవాలని సూచించారు.

పొదుపుపై అవగాహన

మడకశిరరూరల్: విద్యార్థులు, కిశోరి బాలికలకు వేసవి సెలవు సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కిశోరి వికాసం కార్యక్రమం పంచాయతీ కేంద్రాల్లో నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నామని సూపర్ వైజర్ లీలావతి తెలిపారు. శుక్రవారం మెళవాయిలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపు, బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు.